నేటి నుంచి బీజేపీ డివిజన్ అధ్యక్షుల ఎన్నికల ప్రక్రియ

● ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లకు పరిశీలకుల నియామకం

● అధ్యక్ష పదవి కోసం అన్ని డివిజన్లలో బహుముఖ పోటీ

రాంనగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుల ఎన్నికల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానున్నది. నియోజకవర్గంలోని ఆరు డివిజన్లకు ఎన్నికల పరిశీలకులను అధిష్ఠానం నియమించింది. పరిశీలకులు ఈ రోజు ఆయా డివిజన్లలో సమావేశాలు ఏర్పాటు చేసి అధ్యక్ష పదవి ఆశిస్తున్న వారి పేర్లను సేకరించి పార్టీ అధిష్ఠానానికి జాబితాను పంపించనున్నారు. ఆశావహుల్లో ఒకరిని అధిష్ఠానం ఆయా డివిజన్ల అధ్యక్షుడిగా పార్టీ ప్రకటించనుంది. కాగా, నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో పదవి కోసం ఇద్దరి నుంచి ఐదుగురు నాయకులు వరకు పోటీ పడుతున్నారు. అయితే, ఒకటి.. అంతకన్నా ఎక్కువ పర్యాయాలు అధ్యక్షుడిగా పనిచేసిన వారికి ఈసారి అవకాశం ఇవ్వకుండా కొత్త వారికి అవకాశం కల్పించాలని పార్టీ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం డివిజన్ల వారీగా పేర్లను పరిశీలిస్తే ఆరు డివిజన్లకు కొత్త అధ్యక్షులను నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం అధ్యక్షులుగా కొనసాగుతున్న వారు ఎన్నిమార్లు పనిచేశారు అనే విషయం పరిశీలిస్తే అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఆర్.నరేష్ ఒక మారు, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు కలకోట అరుణ్ రెండుసార్లు, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు బద్రీనారాయణ నాలుగు సార్లు, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు సాయిచంద్ రెండుసార్లు, కవాడిగూడ అధ్యక్షుడు మహేందర్‌బాబు ఒకసారి, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రవి ఒకసారి పని చేశారు. దీంతో ఈ ఆరుగురికి పార్టీ నిబంధనల ప్రకారం మరోసారి అధ్యక్షులయ్యే అవకాశాలు లేవని ప్రస్ఫుటమవుతోంది.

పరిశీలకులు వీరే

బీజేపీ డివిజన్ అధ్యక్షుల ఎన్నికల కోసం అధిష్ఠానం ఆరు డివిజన్లకు ఎన్నికల పరిశీలకులను నియమించింది. అడిక్‌మెట్ డివిజన్ పరిశీలకులుగా శారదా మల్లేష్, రాంనగర్ డివిజన్‌కు వెంకటేష్‌గౌడ్, ముషీరాబాద్ డివిజన్‌కు కృష్ణమూర్తి, గాంధీనగర్ డివిజన్‌కు రవిప్రసాద్‌గౌడ్, కవాడిగూడ డివిజన్ ఎన్నికల పరిశీలకుడిగా సత్యనారాయణ గౌడ్ నియమితులయ్యారు.

డివిజన్ల వారీగా ఆశావహులు వీరే

ఈ ఏడాది చివరలో జీహెచ్ఎంసీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో బీజేపీ డివిజన్ల అధ్యక్ష పదవి కోసం చాలా మంది పోటీ పడుతున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా ఉంటే కార్పొరేటర్ టికెట్‌ను అడిగే అవకాశాలు ఉంటాయని వీరు భావిస్తున్నారు. అడిక్‌మెట్ అధ్యక్ష పదవి కోసం మాజీ అధ్యక్షుడు సా యికృష్ణ యాదవ్, బీజేపీ మహిళామోర్చా నియోజకవర్గం మాజీ కన్వీనర్ మాధవి, రాంనగర్ డివిజన్ అధ్యక్ష పదవి కోసం డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.ఉపేందర్, ఉపాధ్యక్షుడు జెక్క శ్రీనివాస్, బీజేవైఎం సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శి శక్తిసింగ్, ముషీరాబాద్ డివిజన్ నుంచి డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి కంచికుమార్, గాంధీనగర్ డివిజన్ నుంచి బీజేపీ ఓబీ సీ మోర్చా ముషీరాబాద్ కన్వీనర్ ఉమేష్, డివిజన్ ఉపాధ్యక్షుడు నవీన్, యువమోర్చా నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఆనంద్ పోటీ పడుతున్నా రు. భోలక్‌పూర్ డివిజన్ నుంచి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు బిజ్జి కనకేష్‌కుమార్, హిందూవాహిణి నాయకుడు బబ్లూ పోటీ పడుతున్నారు. కవాడిగూడ డివిజన్ నుంచి మహేందర్‌బాబు మరోసారి అధ్యక్ష పదవి ఆశిస్తున్నట్లు తెలిసింది.

తెరవెనుక చక్రం తిప్పుతున్న కార్పొరేటర్లు

డివిజన్ అధ్యక్షుల ఎన్నికల్లో తమ వర్గానికి చెందిన వ్యక్తికే డివిజన్ అధ్యక్ష పదవి రావాలని ప్రస్తుత కార్పొరేటర్లు తెర వెనుక చక్రం తిప్పుతున్నారు. అయితే, కార్పొరేటర్ల వ్యతిరేక వర్గం కూడా తమ వారికే అధ్యక్ష పదవి దక్కేలా ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు. రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, గాంధీనగర్ పావనీ వినయ్‌కుమార్, కవాడిగూడ జి.రచనశ్రీ తమ అనువర్గానికి అధ్యక్ష పదవి కోసం ప్రయత్నం చేస్తున్నారు. అడిక్‌మెట్, భోలక్‌పూర్ డివిజన్లలో కార్పొరేటర్లు లేకపోవడంతో డివిజన్ పెద్ద నాయకులు తమ అనుసర వర్గానికే అధ్యక్ష పదవి దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

డాక్టర్ కె.లక్ష్మణ్ ఆశీస్సులున్న వారికే ఎక్కువ అవకాశాలు

ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీకి పెద్ద దిక్కైన రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆశీస్సులు ఉన్న వారికే డివిజన్ అధ్యక్ష పదవులు దక్కే అవకాశాలు ఉన్నాయని పార్టీ పరిశీలకులంటున్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికి అధ్యక్షులుగా అవకాశాలు ఇవ్వాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలిసింది. కార్పొరేటర్లు పార్టీని పట్టించుకోకుండా డివిజన్లలో గ్రూపు రాజకీయాలకు పాల్పడుతున్న నేపథ్యంలో గ్రూపులకు అతీతంగా ఉండేవారికి అవకాశం ఉంటుందని తెలిసింది.



సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొన్న సుప్రీంకోర్టు పూర్వ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణకు జ్ఞాపికను అందజేస్తున్న మాజీ డీజీపీ హెచ్‌జే దొర తదితరులు

సేవలకు ప్రతిరూపం సత్యసాయిబాబా

● సుప్రీంకోర్టు పూర్వ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ

రాంనగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి అంటే సేవలకు ప్రతిరూపం అని సుప్రీంకోర్టు పూర్వ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. బుధవారం విద్యానగర్‌లోని శివంలో తెలంగాణ శ్రీసత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ, హైదరాబాద్‌లో తాను న్యాయవాదిగా ఉన్నప్పుడు పుట్టపర్తిలో శ్రీసత్యసాయిబాబా తన కుటుంబానికి ఇంటర్వ్యూ ఇచ్చి ఆశీర్వదించారన్నారు. తాను ఉన్నతస్థాయికి ఎదగడానికి సత్యసాయి ఆశీస్సులు దోహదపడ్డాయన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ట్రస్ట్ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్ట్ ఏపీ, తెలంగాణ కన్వీనర్, మాజీ డీజీపీ హెచ్‌జే దొర, శ్రీసత్యసాయి సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకట్రావ్, బి.బాలకృష్ణ, డి.రాఘవచారి, ఎన్వీ.రమణ సతీమణి శివమాల, హెచ్‌జే దొర సతీమణి మీనాక్షి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.

చిక్కడపల్లిలో 39 డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు

చిక్కడపల్లి, జనవరి1 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో డిసెంబర్ 31వ తేదీ రాత్రి డ్రంకెన్ డ్రైవ్(డీడీ) కేసులు నమోదు చేసినట్లు పీఎస్ సీఐ ఎస్. వీరేశం తెలిపారు. రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు చిక్కడపల్లి మెట్రోస్టేషన్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 39 కేసులు నమోదయ్యాయని ఆయన వివరించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డవారిని కోర్టులో హాజరుపరుస్తామని వివరించారు. మద్యం తాగి ఎవ్వరూ వాహనాలు నడపవద్దని ఆయన సూచించారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, వంగాల బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

ఆదర్శ స్వచ్ఛంద సంస్థ క్యాలెండర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ, నూతన సం వత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అంతా శుభం కలగాలని అభిలషించారు. బీసీలు అన్ని రంగాల్లో తల ఎత్తుకుని జీవించేలా ఎదగాలన్నారు. ఆదర్శ సంస్థ ఛైర్మన్ వంగాల బాల్‌రాజ్‌గౌడ్, మంజుగౌడ్, నిర్మల, సాంబయ్య, చిక్కా దేవదాసు, అంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కుడిది రాజును సన్మానిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ తదితరులు

రాజు సేవలు అభినందనీయం

చిక్కడపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వీఎస్టీ ఉద్యోగిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన బీజేపీ నేత కుడిది రాజు ఉద్యోగ సేవలు అభినందనీయమని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనీవినయ్‌కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత కుడిది రాజు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా బుధవారం ఆయనను గాంధీనగర్‌లో కార్పొరేటర్ సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వినయ్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, మహమూద్, కృష్ణప్రసాద్, సత్తిరెడ్డి, ప్రకాష్‌యాదవ్, నర్సింహ, సుక్క యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'3న కలెక్టరేట్ల ముట్టడికి విద్యార్థిలోకం తరలిరావాలి'

చిక్కడపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యార్థుల ఫీజులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపుమేరకు ఈనెల 3న జరిగే రాష్ట్ర వ్యాప్త కలెక్టరేట్లు, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడికి విద్యార్థిలోకం కదిలిరావాలని బీసీ విద్యార్థి సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌గౌడ్ పిలుపునిచ్చారు. కాంట్రాక్టర్ల బిల్లులు వేల కోట్లు చెల్లిస్తున్న ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు వందల కోట్లు కూడా చెల్లించడంలేదని వాపోయారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి ఈనెల 3న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లు, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మూడేళ్లుగా విద్యార్థుల స్కాలర్‌షిప్ బిల్లులు చెల్లించడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు.



ఎస్పీ భారతిని సన్మానిస్తున్న మనోహరరెడ్డి, రాజమౌళి, పార్వతి

'లయన్స్ క్లబ్' కల్చరల్ అంబాసిడర్‌గా భారతి

చిక్కడపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320హెచ్ కల్చరల్ అంబాసిడర్‌గా కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ సభ్యురాలు, కూచిపూడి నృత్యగురువు డా. ఎస్పీ భారతిని నియమించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బుధవారం లయన్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్. మనోహరరెడ్డి, రీజినల్ ఛైర్మన్ పీవీ రమణ, అధ్యక్షురాలు కలగా పార్వతి.. కల్చరల్ అంబాసిడర్‌గా భారతి పేరును ప్రకటించి సన్మానించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. కమలానగర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, దోమలగూడ పరిధిలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరుకు, కృష్ణానగర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి 1.30, ఆర్కేమఠ్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, తులసినగర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు, ఇందిరానగర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయం త్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

న్యూ ఇయర్ శుభాకాంక్షలు

నూతన సంవత్సరం సందర్భంగా ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు బుధవారం పలువురు ప్రముఖులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. - (ముషీరాబాద్,అంబర్‌పేట జోన్ బృందం)


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్


మాజీ ఎంపీ వి.హనుమంతరావు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్ తదితరులు


ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఆయన ఫొటో బహూకరించి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కరణం సురేష్, ప్రధాన కార్యదర్శి వరదరాజు తదితరులు


వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుధాకర్‌యాదవ్


లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీకట్టమైసమ్మ ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ తదితరులు


టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కేఆర్‌కే ప్రసాద్, ఎ బ్లాక్ అధ్యక్షుడు పీడీ కృష్ణ


బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాసరావు


తెలంగాణ రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షురాలు నందమూరి సుహాసినిని శాలువాతో సత్కరిస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కె.కిరణ్‌కుమార్


రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీసీ యువజన సంఘం నాయకుడు దూసరి వెంకటేష్‌గౌడ్

ఐక్యతకు నిదర్శనం పద్మశాలీ కాలనీవాసులు

● ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలీ కాలనీలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను వినూత్నంగా జరుపుకున్నారు. స్థానికంగా ఉండే ఐదు వందల కుటుంబాల్లో ఏ ఒక్క ఇంట్లో పొయ్యి వెలిగించకుండా అందరూ కలిసి ఒకేచోట సహపంక్తి భోజనం చేసేలా ఏర్పాట్లు చేశారు. పద్మశాలీ కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సహపంక్తి భోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై కాలనీవాసులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఐక్యతకు నిదర్శనం పద్మశాలీ కాలనీవాసులని కొనియాడారు. పండుగలు, శుభకార్యాలను కలిసి కట్టుగా జరుపుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, యువ నాయకుడు ముఠా జైసింహ, బింగి నవీన్, పద్మశాలీ కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సుందర్ పటాలే, ఆర్.ఆంజనేయులు, సొసైటీ నాయకులు శ్రీనివాస్ పటాలే, గోవింద్ రాజ్, కమల్‌కుమార్ శర్మ, సుజాత, ఉమా పాల్గొన్నారు.


సహపంక్తి భోజనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ప్రమాదవశాత్తూ మంటలంటుకొని వ్యక్తికి తీవ్రగాయాలు

● ప్రాణాలకు తెగించి బాధితుడిని కాపాడిన విద్యుత్ లైన్‌మెన్

ముషీరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ ఇంట్లో మంటలంటుకుని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని విద్యుత్ శాఖ లైన్‌మెన్ తన ప్రాణాలకు తెగించి కాపాడాడు. వివరాలు.. ముషీరాబాద్ డివిజన్ రాంనగర్ బ్రహ్మంగారి ఆలయం వీధిలోని పురాతన ఇంట్లో ఇమ్మాన్యుయేల్ (58) ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. మంగళవారం అర్ధరాత్రి అతని ఇంటి నుంచి దట్టమైన పొగ వస్తుండగా స్థానికులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి, పోలీసులకు, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజిన్ వచ్చినప్పటికీ వీధి ఇరుకుగా ఉండటంతో ఇమ్మాన్యుయేల్ ఇంటి వద్దకు వెళ్లేందుకు వీలుపడక మధ్యలోనే ఆగిపోయింది. ఘటనా స్థలానికి చేరుకున్న ఆజామాబాద్ డివిజన్ విద్యుత్ శాఖ లైన్‌మెన్ ఎ. కిరణ్‌కుమార్ ఇమ్మాన్యుయేల్ ఇంటి తలుపులు పగులగొట్టాడు. స్థానికంగా ఉన్న ఓ ఇంటి బోరింగ్ సహాయంతో మంటలపై నీళ్లు చల్లాడు. మంటలను లెక్క చేయకుండా తన ప్రాణాలకు తెగించి ఇంట్లోకి వెళ్లాడు. కాలిన గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్న బాధితుడిని తన భుజంపై వేసుకొని బయటకు తీసుకువచ్చాడు. అప్పటికే ఘటనా స్థలానికి చేరుకున్న 108 వాహనంలో పోలీసులు ఇమ్మాన్యుయేల్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాళ్లు, చేతులు, తలకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఒంటరిగా ఉండే ఇమ్మాన్యుయేల్ ఇంట్లో కొవ్వొత్తును వెలిగించగా, దాని మంట దుస్తులకు అంటుకోవడంతో అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు. చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ రాంబాబు, ఎస్సై ప్రశాంత్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.


గాయపడ్డ ఇమ్మాన్యుయేల్

శభాష్ కిరణ్..

మంటల్లో చిక్కుకున్న ఇమ్మాన్యుయేల్‌ను తన ప్రాణాలకు తెగించి కాపాడిన విద్యుత్ శాఖ లైన్‌మెన్ కిరణ్ కుమార్‌ను బుధవారం బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బీజేపీ నాయకులు అజయ్ గుప్తా, వెంకటేష్ పాల్గొన్నారు.


లైన్‌మెన్ కిరణ్ కుమార్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేత ఎం. నవీన్ గౌడ్ తదితరులు


భోలక్‌పూర్‌లో పర్యటించిన జలమండలి సెక్షన్ మేనేజర్ కృష్ణమోహన్, కాంగ్రెస్ నేత మసూద్

డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి రూ.10.50 లక్షలు మంజూరు

ముషీరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : భోలక్‌పూర్ డివిజన్ సందాని వీధిలో గత 10 సంవత్సరాలుగా నెలకొన్న డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.10.50 లక్షలు మంజూరయ్యాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మసూద్ తెలిపారు. బుధవారం సందాని వీధిలో జలమండలి అధికారులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా మసూద్ మాట్లాడుతూ, అనిల్ కుమార్ యాదవ్ తన ఎంపీ నిధుల నుంచి రూ.10.50 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. డ్రైనేజీ పైప్‌లైన్‌ల నిర్మాణం అనంతరం రోడ్లు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో జలమండలి సెక్షన్ మేనేజర్ కృష్ణమోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖైరత్ అలీ, అబ్దుల్ ఖరీం, ఉస్మాన్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి దర్శనానికి పోటెత్తిన ఆలయంవద్ద పోటెత్తిన భక్తులు

భక్తులతో వెంకటేశ్వర స్వామి ఆలయం కిటకిట

చిక్కడపల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సర్వదర్శనం, స్వర్ణపుష్పార్చన లైన్ల ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎంపీ కె. లక్ష్మణ్, రాంనగర్ కార్పొరేటర్ రవిచారి, మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్‌గౌడ్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీనాథ్‌గౌడ్, ఆలయ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయ ఈఓ బదిలీ..

చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఈఓ కె. రామాంజనేయులు బదిలీ అయ్యారు. కొమరవెల్లి మల్లన్న ఆలయం ఈఓగా బుధవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. కాగా వేంకటేశ్వరస్వామి ఆలయం ఈఓగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయ ఈఓగా గతంలో పనిచేసిన అన్నపూర్ణను నియమించారని, ఆమె గురువారం బాధ్యతలు స్వీకరిస్తారని తెలిసింది.

రైలు ఢీకొని హోంగార్డు మృతి

బర్కత్ పుర జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని పోలీసు హోంగార్డు మృతి చెందింది. కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ పేట్లబురుజు సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో శంకర్ భార్య పుష్ప(50) హోంగార్డుగా పని చేస్తోంది. బుధవారం కందిగల్ గేట్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన పుష్ప అక్కడికక్కడే మృతి చెందింది. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అజంతా ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణికురాలి బ్యాగ్ చోరీ

బర్కత్ పుర జనవరి1 (ఆంధ్రజ్యోతి): అజంతా ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణికురాలి బ్యాగ్‌ను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మణికొండ నివాసి నాగమణి నాగర్‌సోల్ నుంచి కాచిగూడకు అజంతా ఎక్స్‌ప్రెస్ రైల్లో కుటుంబ సభ్యులతో కలిసి వస్తోంది. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు రాగానే ఆమె బ్యాగు కనిపించ లేదు. దీంతో బాధితురాలు నాగమణి బుధవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. బ్యాగ్‌లో రెండు సెల్‌ఫోన్లు, ఒక చేతి వాచ్, రూ.12 వేల నగదు ఉన్నాయని పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.